



అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 2 సంచిక -5 శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Disitrcts

## అసౌకర్యం కలిగితే క్షమించండి



**ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం**

**కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్య పోయింది**

**కుంభమేలా ముగింపుపై మోడీ వెల్లడి**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):
ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది.

మిగతాది 2లో...

## తెలంగాణ రైజింగ్ ను ఎవరూ ఆపలేరు






- హైదరాబాద్ అన్‌స్టాపబుల్
- దావోస్ పర్యటన వల్ల భారీగా పెట్టుబడులు
- దిగ్గజ సంస్థలు మన వద్దకు వస్తున్నాయి
- పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదు..ప్రపంచ స్థాయి నగరాలతోనే
- కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుతోనే రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు
- రాష్ట్రంలో పెరిగిన కృత్రిమ మేధ వినియోగం.. అతితక్కువ ద్రవ్యోల్బణం
- తెలంగాణ ఎదుగుదలను ఆపలేమని ప్రపంచమే గుర్తించింది
- హెచ్‌సీఎల్ టెక్ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

హైదరాబాద్ ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరని సిఎం రేవంత్ రెడ్డి అన్నా రు. తన పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదని, ప్రపంచస్థాయి నగరాలతో పోటీ పడేలా ఆలోచన చేస్తున్నామన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లో హెచ్‌సిఎల్ టెక్ కొత్త క్యాంపస్‌ను సిఎం రేవంత్ రెడ్డి గు రువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుతో రాష్ట్రానికిపెద్ద సంస్థలు వస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఉద్యో గాల కల్పనలో నెంబర్‌వన్‌గా నిలిచామని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్ కంపెనీ ఆమ్జేన్‌ను ప్రారంభించామని, హైదరాబాద్‌లో బయో ఏషి యా సదస్సు కూడా నిర్వహించామని ఆయన గు ర్తు చేశారు.

మిగతా 2లో.

## తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

### 3న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన





హైదరాబాద్ ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):
తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరిగిన పోలింగ్ పక్రియ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ లో 3, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే, సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. మిగతాది 2లో...

## శ్రీశైలం, నాగార్జున సాగర్ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

**: ఏపీ, తెలంగాణలకు కేఆర్ఎంబీ**



2లో.

## ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమే


**: ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**గత ప్రభుత్వం నీటి తొలగింపు పనులు చేపట్టి ఉంటే ప్రమాదం జరగకపోయేదన్న మంత్రి**

**రెండు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తామని వెల్లడి**

**హరీశ్ రావు రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆరోపణ**



## తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు

**మే 7 నుంచి 31 వరకు గ్రాండ్ ఫినాలె -వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా పాల్గొననున్న దేశాలు**

2లో.

## సహాయక బృందాల సమన్వయంలో సర్కార్ విఫలం

**టిబిఎం కటింగ్ అనుమతికి నాలుగు రోజులా?**

**ఆదరాబాదరానిర్ణయాలతో ప్రాణాలకు ముప్పు.. ప్రాజెక్టు బలి**

**ఎస్ఎల్‌బిసిటన్నెల్ వద్ద మీడియాతో బిఆర్ఎస్ అగ్రనేత హరీశ్**

**అంతకుముందు టన్నెల్‌లోకి అనుమతించకపోవడంతో రహదారిపైనే ధర్నా**

2లో.



## ఎవరిని అడిగి హామీలిచ్చారు?



**మోడీ ప్రభుత్వం డబ్బులిస్తేనే అభివృద్ధి చేస్తామని చెప్పారా? బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడే వ్యక్తిని కాను ప్రాజెక్టులను అడ్డుకున్నట్లు నిరూపించే దమ్ము సిఎం రేవంత్‌కు ఉందా?**

**మెట్రో కోసం వారి వద్ద ఒక్క పైసా లేదు..కానీ నెపం మాపైన నెడుతున్నారు సిఎం రేవంత్‌పై విరుచుకుపడిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్ ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మమ్మ ల్ని అడిగి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారా? అని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీ జేపీ ప్రభుత్వం డబ్బులు ఇస్తేనే అభివృద్ధి పనులు చేస్తానని చెప్పారా.. ప్రాజెక్టులకు రూపకల్పన చే శారా? రాష్ట్రాలు ఇలా బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. లేనిది ఉన్నట్టుగా చెప్పడం అలవాటైందని, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అనేక ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు వివిధ విభాగాలతో మాట్లాడి ఉత్తరాలు రాస్తూ అభివృద్ధి పనులు జరిగేలా చూస్తున్నానని, బెదిరింపు రాజకీయాలు చేస్తే ఎవ రు భయపడేవారు లేరని స్పష్టం చేశారుమిగతాది 2లో...

## వేగంగా కొనసాగుతున్న బురద తొలగింపు చర్యలు

**ఎస్ఎల్‌బీసీ వద్ద ఇంకా వీడని ఉత్కంఠ**

3లో.



# తెలంగాణ రైజింగ్ ను ఎవరూ ఆపలేరు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్‌సిఎల్ టెక్ కంపెనీ దేశానికి గర్వ కారణమని ఆయన పేర్కొన్నారు. హెచ్‌సిఎల్ భా రతదేశం గర్వించేలా చేస్తోందని, 60 దేశాల్లో 2. 2 లక్షల మందితో పని చేస్తుందని ఆయన కొనియాడారు. డిజిటల్, ఇంజనీరింగ్, క్లౌడ్, ఏఐ రం గాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్‌ను ఈ కంపెనీ క్రియే ట్ చేస్తుందన్నారు. 2007లో హైదరాబాద్‌లో అడుగుపెట్టిన హెచ్ సిఎల్ ప్రస్తుతం భారీగా ఎదిగిందని సిఎం రేవంత్ గుర్తు చేశారు. ఇప్పుడు 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు 5 వేల మందితో ప్రపంచస్థాయి సదుపాయాలతో హెచ్ సిఎల్ టెక్ హైదరాబాద్‌లో పనులు చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా హెచ్‌సిఎల్ కూడా తెలంగాణలో అద్భుతంగా పని చేస్తుందని సిఎం కితాబునిచ్చారు.రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని సిఎం రేవంత్ చెప్పారు. మల్టీనేషనల్, బడా కార్పొరేట్ సంస్థలతో హైదరాబాద్ వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాయని, ప్రతి రోజు తాను ఈ సంస్థలతో ఎంఓయూలు, లేదా కార్యాలయాల ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అతి పెద్దమొత్తంలోపెట్టుబడులను రాబట్టగలిగామన్నారు. ఉద్యోగాల కల్పనపై ఫోకస్ పెట్టామని, ఎక్కువగా ఏఐ వినియోగాన్ని పెంచు కున్నామని, తక్కువ ద్రవోల్బణంతో ముందుకు వెళ్తున్నామని ఆయన చెప్పారు. తెలంగాణకు వస్తున్న పెట్టుబడులు, కుదుర్చుకుంటున్న ఒప్పందాలు చూశాక తెలంగాణ ఎదుగుదలను ఆపలేమని అందరు అంగీకరించక తప్పడం లేదన్నారు. తెలంగా ణలో కొత్త ఈవీ పాలసీ తీసుకువచ్చామని సిఎం రేవంత్ తెలిపారు. డేటా సెంటర్ హబ్‌గా రాష్ట్రాన్ని మార్చుతున్నా మని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ దూసుకుపోతుందని తెలంగాణ రైజింగ్ అంశాన్ని తాను ప్రస్తావిస్తే తొలుత అందరూ సందేహాలు వ్యక్తం చేశారని, కానీ, ఇప్పుడు ప్రపంచమే అంగీకరిస్తుందన్నారు.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మార్చాలని సిఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఇందుకోసమే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ వర్శిటీలో హెచ్‌సిఎల్ భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

## అసౌకర్యం కలిగితే క్షమించండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఏపీలో 2 గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ సమయం ముగిసే నాటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 65.43 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం పోలింగ్ నమోదు అయింది. ఎన్‌టీఆర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 61.99 శాతం నమోదు అయింది. మరోవైపు, తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కరీంనగర్- మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 40.61 శాతం, ఇవే జిల్లాల్లో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 63.49 శాతం పోలింగ్ నమోదు కాగా, వరంగల్- నల్లగొండ- ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 76.35 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. కాగా, వచ్చే నెల 3వ తేదీన తుది ఫలితాలను ఎన్నికల కమిషన్ వెల్లడించనుంది.

## శ్రీశైలం, నాగార్జున సాగర్ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

హైదరాబాద్ ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):

శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లోని నీటిని ఉభయ తెలుగు రాష్ట్రాలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. త్రాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పంటల సాగును దృష్టిలో ఉంచుకుని నీటిని వినియోగించుకోవాలని చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలోని బోర్డు నిర్ణయించింది. ఈ బోర్డు సమావేశం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది.

తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇతర ఇంజినీర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో నీటి వినియోగంపై ఈ సమావేశంలో చర్చించారు.మే నెలాఖరు వరకు తెలంగాణ రాష్ట్రానికి 63 టీఎంసీల నీరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, 55 టీఎంసీల నీరు అవసరమని ఆయా రాష్ట్రాలు కోరాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు సూచించింది. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని తెలిపింది.

## కేదార్ మృతిపై వీడని మిస్టరీ

హైదరాబాద్ ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):



తెలుగు సినీ నిర్మాత కేదార్ మృతి మిస్టరీగా మారింది. అది ఇంకా వీడలేదు. దీంతో మృతదేహం ఇంకా దుబాయ్‌లోనే ఉండిపోయింది. ప్రాథమికంగా గుండెపోటుతో మరణించినట్టు భావించిన దుబాయ్ పోలీసులు, ఆ తర్వాత మృతునికి హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసుతో సంబంధాలున్నట్టు సమాచారం అందడంతో అనుమానాస్పద మృతిగా పరిగణించి దర్యాప్తు తిరిగి ప్రారంభించినట్టు సమాచారం. దీంతో మూడు రోజులుగా కేదార్ మృతదేహం దుబాయ్‌లోనే ఉండిపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతనే మృతదేహాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్టు దుబాయ్ పోలీసులు చెప్పినట్టు తెలిసింది.ఇలా ఉండగా ర్యాడిసన్ డ్రగ్ కేసులో నిందితుడిగా ఉన్న కేదార్‌కు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులతో పరిచయాలు ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. తనకు పరిచయం ఉన్న సెలబ్రిటిలతో ఆయన దుబాయ్‌లో స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడులు పెట్టించడం, అక్కడ ఆస్తులు కొనిపెట్టడంలో కేదార్ మధ్య వర్తిగా వ్యవహరించినట్టు తాజాగా బయటపడింది. ఈ కారణంగా కేదార్ అనుమానాస్పద మృతికి ఈ వ్యాపార లావాదేవీలు ఏమైనా కారణమా? అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. అలాగే కేదార్ మృతి చెందిన హోటల్లోనే ఉత్తర తెలంగాణకు చెందిన తాజా మాజీ ఎమ్మెల్యే ఒకరు ఉన్నట్టు కూడా రూడీ అయిందని చెబుతున్నారు.ప్రస్తుతం సదరు మాజీ ఎమ్మెల్యే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. దీంతో కేదార్ ఆకస్మిక మృతిపట్ల అనుమానాలు బలపడుతున్నాయని చెబుతున్నారు.

## ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమే: ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):

ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమేనని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం సొరంగంలో నీటి తొలగింపు పనులు చేపట్టి ఉంటే ఇప్పుడు ఈ ప్రమాదం జరిగేది కాదని ఆయన అన్నారు. ఎస్ఎల్‌బీసీ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆయన, రెండు రోజుల్లో సహాయక చర్యలను పూర్తి చేస్తామని తెలిపారు.

రెండు నెలల్లో తిరిగి సొరంగం తవ్వకాల పనులు చేపడతామని వెల్లడించారు. గ్రావిటీ ద్వారా 30 టీఎంసీలు తీసుకునే ప్రాజెక్టును పక్కన పెట్టారని, ఈ టన్నెల్‌ను పూర్తి చేసి ఉంటే 4.50 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవని ఆయన అన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన ప్రాజెక్టులన్నీ వాళ్ల జేబులను నింపుకోవడానికేనని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును కడితే అది మూడేళ్లకే కూలిపోయిందని అన్నారు.గతంలో శ్రీశైలం పవర్ ప్లాంటులో అగ్ని ప్రమాదం జరిగి ఆరుగురు ఉద్యోగులు మృత్యువాత పడితే కేసీఆర్ వెళ్లి చూడలేదని విమర్శించారు. పాలమూరు పంప్‌హౌస్‌లో ప్రమాదం జరిగినప్పుడు కూడా ఆరుగురు చనిపోయారని, అప్పుడూ స్పందించలేదని అన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది భక్తులు చనిపోతే కేసీఆర్ వెళ్లలేదని విమర్శించారు. మాసాయిపేట రైలు ప్రమాదంలో చిన్నారులు చనిపోయినప్పుడు కూడా ఆయన పరామర్శించలేదని పేర్కొన్నారు.కానీ, ఇప్పుడు మాత్రం హరీశ్ రావు ప్రమాదం జరిగిన చోటుకు వచ్చి రాజకీయం చేయాలని చూశారని ధ్వజమెత్తారు. హరీశ్ రావుకు అనుభవం ఉంటే పదేళ్లలో ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. సొరంగంలో నిపుణుల చర్యలకు ఇబ్బంది కాకూడదని అందరినీ లోనికి పంపించడం లేదని వెల్లడించారు. బురద తొలగింపు పనులు జరుగుతున్నట్లు చెప్పారు.

# సహాయక బృందాల సమన్వయంలో సర్కార్ విఫలం

అచ్చంపేట ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):

నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బిసి ఇన్ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదంలో చి క్కుకున్న ఎనిమిది మందిని సురక్షితంగా బయటికి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు ధ్వజమెత్తారు. గురువారం ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎ మ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి టన్నెల్‌ను సందర్శించా రు. హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు చేరుకున్న మాజీ మంత్రికి పార్టీ జిల్లా అధ్యక్షు డు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, హాజీపూర్ వద్ద స్వాగతం పలికారు. అక్కడి నుండి భారీ కాన్వాయ్ నడుమ పార్టీ శ్రేణులతో కలిసి దోమలపెంటకు చేరుకున్నారు. ఎస్ఎల్‌బిసి ఇన్ టన్నెల్ వద్దకు వెళ్లేందుకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సిలతో కలిసి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులుఅనుమతించలేదు. పది మంది ముఖ్య నేతలతో కలిసి వెళ్తామని చెప్పిన వినకపోవడంతో జెపి క్యాంపు కార్యాలయం చెక్ పోస్ట్ వద్ద బైఠాయించి ఆందోళన వ్యక్తం చేయడంతో లోపలికి వెళ్లేందుకు అనుమతించారు. తిరిగి వచ్చిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. మేము బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యాన్ని చెప్పడంతో పాటు సహాయక చర్యలు ఎలా ఉన్నాయి, రిలీఫ్ స్టెప్స్ ఏమేమి తీసుకుంటున్నారో చూద్దామని, అవసరమైన సూచనలు ప్రభుత్వానికి చేద్దామని మేము ఇక్కడికి వచ్చాము. మాతో వచ్చిన నాయకులను లోపలికి అనుమతించలేదని అన్నారు. అయినా మేము సహకరించామని, తొలుత 8 నుంచి 10 మందికి లోపలికి వెళ్లేందుకు అనుమతిస్తామని అన్నారు. ఆ తర్వాత అయిదు ఆరుగురు అన్నారు. ఆ తర్వాత ఒక్కరే పోవాలని అడ్డుకున్నారు. లోపలికి పోకుండా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారని, మేము బాధిత కుటుంబ సభ్యులను కలుద్దామని అనుకుంటే వాళ్లను కూడా కలవనీయకుండా చేశారని అన్నారు.

వాళ్ల కుటుంబ సభ్యులను ఇక్కడి నుండి పంపించేసి దాచిపెట్టిన పరిస్థితి ఉందని, ఈ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ అంటే ఎందుకింత భయమని అన్నారు. టన్నెల్‌లో చిక్కుకొని ఇప్పటికి ఆరు రోజులైంది. వారి గురించి తెలుసుకునేందుకు సిటి ఎన్‌డిఆర్ఎఫ్ టీంతో మాట్లాడాను. వారి సేవలు అభినందనీయం. చివరి పాయింట్ వరకు వెళ్లినట్లు చెప్పారు. చివరి పది మీటర్స్‌లో కేవలం 1.2 మీటర్లు మాత్రమ స్పేస్ ఉందన్నారు. కానీ అక్కడ ఆక్సిజన్ సరిగ్గా లేదని అన్నారు. అక్కడి పరిస్థితులు చూస్తే గత 5, 6 రోజుల నుంచి వివిధ బృందాల మధ్య ప్రభుత్వం సమన్వయం లోపం ఉన్నట్లు అనిపిస్తుందన్నారు. ఎవరు ఏం పని చేయాలనే లోపం ఉందని, వారికి ఒక స్పష్టమైన డైరెక్షన్ లేదని అన్నారు. ఆరు రోజుల వరకు డైరెక్షన్ ఇయ్యకుండా ప్రభుత్వం ఉండడం సిగ్గు చేటని, ఇన్ని రోజుల వరకు డైరెక్షన్ ఇయ్యకపోతే లోపల ఉన్న వాళ్ల ప్రాణాలు ఏమైపోతాయని, అసలు ఏ రకంగా ముందుకు పోవాలని నిర్ణయం తీసుకోవడానికి ఆరు రోజులు పడుతుందా అని ప్రశ్నించారు. ఇదేమన్నా టూరిస్ట్ ప్లేసా..?మంత్రులు పొద్దున్నే వచ్చి, సాయంత్రం పోతున్నారని అన్నారు. హెలికాప్టర్ వేసుకుని ఆ ఎలక్షన్ ప్రచారాని పోతున్నారని, ముఖ్యమంత్రి ఇంత వరకు రాలేదని, డైరెక్షన్ లేదు, ఓ మంత్రి రోజు సాయంత్రం వస్తుందని విమర్శించారు.

ఇంతకంటే ముఖ్యమైన పని ఏముంటదా అని ప్రశ్నించారు. గంటల్లో మరమ్మత్తు చేయగలిగే కన్వేయర్ బెల్ట్‌కు ఇన్ని రోజులు తీసుకోవడం ఎక్కడా చూడలేదన్నారు. ప్రమాదంలో ధ్వంసమైన టీఎన్‌ఎంను కత్తిరించేందుకు అనుమతికి ఐదు రోజులు తీసుకోవడం ఎంటన్నారు. దీని వల్ల లోపల ఉండే వాళ్ల ప్రాణాలు ఏం కావాలి అని నిలదీశారు. తొందరగా నిర్ణయం తీసుకుని ఫాస్ట్‌గా డీ వాటరింగ్ చేసి లోపలున్న బాధితులను రక్షించాలన్నారు. లోపల చిక్కుకున్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాడటం పట్ల మీకున్న చిత్తశుద్ధి ఇదేనా అని నిలదీశారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని మంత్రి చెబుతున్నారు. ఇక్కడ వాస్తవాలు వేరుగా ఉన్నాయని అన్నారు. బాధితులను కాపాడాలని మేము కోకుంటే వాళ్లేమో రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ నిర్లక్షం వల్ల టన్నెల్ ప్రమాదమని చెప్పడానికి సిగ్గుండాలని అన్నారు. పని ప్రారంభించేటప్పుడు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అనుమతి ఇచ్చిందా.. ఇస్తే రిపోర్ట్ బయట పెట్టండి. లేదు నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ పర్మిషన్ ఉంటే రిపోర్ట్ బయట పెట్టండన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టుకు రూ. 3300 కోట్ల పని జరుగుతే మా తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలనలో 3900 కోట్ల పని జరిగిందన్నారు. కరోనా వచ్చిన అధిక పని చేశామన్నారు.

# తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు

హైదరాబాద్ ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):

మిస్ వరల్డ్ పోటీలు అంటే ప్రపంచంలోనే ఓ అరుదైన, అద్వితీయమైన వేడుక. వివిధ దేశాల నుంచి సుందరీమణులు పాల్గొనే ఈ వేడుకలకు ఈసారి తెలంగాణలోని హైదరాబాద్ వేదిక కానుంది. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం అనే మాట వింటుంటేనే హైదరాబాద్ జోష్ పెంచుతుంది. ఒక్కసారి ప్రపంచం దేశాలన్ని హైదాబాద్ వైపు చూపుతిప్పుకునే ఆ రోజు అతి చేరువలోనే ఉంది. ఈ ఏడాది ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్‌లో చెయ్యాలని నిర్వాహకులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. దీంతో 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నది. చారిత్రక, వారసత్వ సంపదను ప్రపంచానికి చాటడానికి తెలంగాణకు ఇదొక గొప్ప అవకాశం కానుంది. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటేందుకు అరుదైన ఘట్టం కానుంది. ఈ ఏడాది అందాల పోటీలకు అనువైన ప్రదేశంగా తెలంగాణను ఎంచుకోవడం, అందులోనూ హైదరాబాద్ వంటి మహానగరం ఈ వేడుకులకు సిద్ధమవ్వడం ఈ ప్రభుత్వంలో జరిగే ఓ అద్వితీయం వేడుకగా చెప్పవచ్చు. ఈ ఏడాది మేనెలలో నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతోపాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా దేశాలు పాల్గొంటాయి. బ్యూటీ విత్ ఎ పర్పస్ అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మిస్ వరల్డ్ అందాల పోటీల్లో పాల్గొనే దేశ విదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలకబోతుంది. మే 7 నుంచి ఈ అందాల పోటీలు ప్రారంభం కానున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే ఉంటుంది. ప్రస్తుత మిస్ వరల్డ్ తర్వాత అందాల సుందరి కిరీటాన్ని ఎవరు ధరిస్తారో గ్రాండ్ ఫినాలే రోజు తేలనుంది. గతంలో న్యూఢిల్లీ, ముంబైలో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారు. 71వ ఎడిషన్ ముంబైలోనే జరిగింది. ప్రపంచంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ వేడుకలకు వేదికైంది. ఐటీ, ఫార్మాసూటికల్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణకు ఈ అవకాశం దక్కడం నిజంగా గర్వించదగ్గ విషయమే. తెలంగాణను పర్యాటకంగా ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో టూరిజం శాఖ దేశ విదేశీ పర్యాటకులను ఇప్పటికే ఆహ్వానాలు పంపుతోంది. గొప్ప చేనేత వారసత్వం, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, అరుదైన వంటకాలు, విభిన్నమైన కళా వారతస్వమున్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని.. మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మన్, సీఈఓ జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ తాజాగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేసారు. మిస్ ఇండియా పోటీలు అంటేనే సుందరీమణుల అలరిస్తారు. అందులోనూ మిస్ వరల్డ్ పోటీలు అంటే ఇంక మాటల్లో చెప్పక్కర్లేదు. ఎంత ఆహ్లాదంగా ఉంటుంతో, అంతే స్థాయిలో వివిధ దేశాల యువతుల మధ్య గట్టిపోటీ కూడా సర్వసాధారణం. ఈ పోటీల వేదికగా హైదరాబాద్ బ్రాండ్ వాల్యూని మరింత పెంచడంతోపాటు, ప్రపందేశాల ప్రతినిధులను ఆకట్టుకునేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది తెలంగాణ ప్రభుత్వం.

# ఎవరిని అడిగి హామీలిచ్చారు?

(మొదటి పేజీ తరువాయి)

.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గురువారం స్పందించారు. రేవంత్ రెడ్డి మాటలను నమ్మేవారు ఎవరూ లేరని, అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డిని నమ్మి ఇపుడు ఆయన ఎలాంటి గాలి మాటలు మాట్లాడుతారో ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. నేనేం ఆయన, కాంగ్రెస్ పార్టీ దయా దాక్షిణ్యాలతో పార్లమెంట్ లోకి రాలేదు..నేను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీని. రేవంత్ మాటలకు నేను జవాబుదారీని కాదు. ముఖ్యంగా ఒక్క విషయంలో అయినా ఆయనకు దమ్ము, ధైర్యం ఉంటే నేను ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించాలని సవాలు చేస్తున్నానని అన్నారు. చేతకాని ముఖ్యమంత్రి, దమ్ము లేని ముఖ్యమంత్రి, మాటలు చెప్పి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తే ఎలాంటి ఆర్థిక ప్రణాళిక చేస్తారో కూడా ఓ కార్యాచరణ లేదని, మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి ఎలా డబ్బులు తెచుకుంటారో కూడా ఆయనకు ఓ క్లారిటీ లేదన్నారు. ఇటీవలే ప్రాజెక్టును కేంద్రానికి పంపారని, అది అన్ని మినిస్ట్రీలకు సర్క్యులేట్ చేయాల్సి ఉంటుందని, ఏదో ఇలా పంపగానే అలా అయిపోదు.దానికో సిస్టం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఎలాంటి అవగాహన లేకుండా దుందుడుకుగా మాట్లాడుతున్నారని చెప్పారు. బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్‌కు తాను భయపడే వ్యక్తిని కాదని సీఎం రేవంత్ రెడ్డి పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బిజినెస్ పార్ట్‌నర్ అంటూ సీఎం రేవంత్ కామెంట్ చేశారు. కేసీఆర్ కోసమే కిషన్‌రెడ్డి పని చేస్తున్నారని, మెట్రో సహా ఇతర ప్రాజెక్టులను పూర్తి చేస్తే తనకు పేరుస్తుందనే కేంద్ర కేబినెట్‌లో అడ్డుకుంటున్నారని మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. తెలంగాణ కు సీఎం రేవంతా లేకపోతే నేనా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గాలి మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్ కు తాను భయపడే వ్యక్తిని కాదని కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రాజెక్టులను అడ్డుకున్నట్లుగా నిరూపించే దమ్ము రేవంత్‌కు ఉందా అని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వద్ద నయాపైసా లేదని, కానీ నెపం నాపై నెడుతున్నారని ఆరోపించారు. రేవంత్ సీఎం కావడం తెలంగాణ ప్రజల దురదృష్టమని కిషన్ రెడ్డి అన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

## - ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాల తీరును పరిశీలించిన జిల్లాల కలెక్టర్లు





**వరంగల్/ఫిబ్రవరి 27(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ హనుమకొండ జిల్లాలలో ప్రవేశపెట్టిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. గురువారం పట్టభద్రులు ఉపయోగించుకుంటున్న తమ ఓటింగ్ విధానం, పోలింగ్ కేంద్రాల వద్ద వ్యవహార శైలి రెండు జిల్లాలకు చెందిన కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా తెలిపిన వివరాల ప్రకారం వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహణ వరంగల్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయని తెలిపారు.

ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయ ఓటర్లు ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల ముందు తమ తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరారు.

జిల్లాలో మొత్తం 2352 మంది ఓటర్లు ఉండగా 94.13 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఎన్నికలను పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం బుధవారం మధ్యాహ్నం వరకే పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలతో పాటు ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందిని ప్రత్యేక బస్సుల ద్వారా జిల్లాలోని 13 మండలాల పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నిక నిర్వహణ సాయంకాలం 4 గంటలు సమయానికి ముగిసిందన్నారు. ఎన్నికలు జరుగుతున్న పరిస్థితులను కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఓటింగ్ సరళిని వీక్షించారు. సెంట్రల్ డిసిపి షేక్ సలిమాతో కలసి వరంగల్ పట్టణంలోని ఇస్లానియా కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ పక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్ లను నల్గొండ జిల్లా కేంద్రానికి తరలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 13 మండలాల నుండి ప్రత్యేక వాహనాల ద్వారా బ్యాలెట్ పత్రాలను భారీ బందోబస్తు మధ్య నల్గొండ జిల్లా కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. జిల్లాలోని 13 మండలాలో 2352 ఓట్లకు గాను 2214 ఓట్లు 94.13 శాతం నమోదయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన ఓటర్లు అత్యధిక సంఖ్యలో ఓటును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

### హనుమకొండ జిల్లాలో పోలింగ్ ప్రశాంతం

హనుమకొండ: వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి జరిగిన ఎన్నికలకు హనుమకొండ జిల్లాలో గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు 15 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఉపాధ్యాయ ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరిగింది. హనుమకొండలోని యూనివర్సిటీ లా కాలేజీ , కాకతీయ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి ప్రావిణ్య సందర్శించి పోలింగ్ సరళీని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో సాగుతున్న పోలింగ్ ప్రక్రియ గమనించారు. వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో 5215 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా ఇందులో 4780 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనికి సంబంధించి 91.66 ఓటింగ్ శాతం నమోదయిందని వివరించారు. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలోని నాలుగు మండలాలైన భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు మండలాల్లో 166 ఓట్లు ఉండగా 103 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఈ మండలాల్లో 62.05 శాతం ఓటింగ్ నమోదయింది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలోని 4 మండలాలైన భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు మండలాల్లో 4585 మంది ఓటర్లు ఉండగా 1780 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 38.82 ఓటింగ్ శాతం నమోదైనట్లు కలెక్టర్ తెలిపారు.

# రావణ వాహనసేవలో దర్శనమిచ్చిన మల్లికార్జున స్వామి

## - రథోత్సవాన్ని ప్రారంభించిన అద్దంకి సోదరులు



**ఐనవోలు/ఫిబ్రవరి 27(జర్నలిస్ట్ వార్త):** ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా 4వ,రోజు గురువారం రావణ వాహనసేవలో మల్లికార్జున స్వామి దేవాలయ మాడ వీధులలోని భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయ నిర్వాహకులు అద్దంకి సోదరులు ఈఓ నాగేశ్వర్ రావు, అకౌంటెంట్ అద్దంకి కిరణ్ కుమార్, అర్చక సిబ్బంది మంత్రోచ్ఛరణతో రథాన్ని లాగుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయంలో నిత్యాహ్నికము, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉప ప్రధానార్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు, పాతర్లపాటి శ్రీనివాస్ ఐనవోలు మధుకర్ శర్మ, అర్చకులు నందనం భాను ప్రసాద్ శర్మ, నందనం మధు శర్మ, పాతర్లపాటి నరేష్ శర్మ, ఉప్పుల శ్రీనివాస్, దేవేందర్, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.?

# విద్యుత్ షాక్ తో వ్యవసాయ రైతు మృతి

## - కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు





**వర్ధన్నపేట/ఫిబ్రవరి 27(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో వ్యవసాయ భూమి వద్ద గురువారం విద్యుత్ షాక్ తో రైతు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వర్ధన్నపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ల్యాబర్తి గ్రామానికి చెందిన బల్గురి వెంకటేశ్వర్లు అనే రైతు ప్రస్తుతం హైదరాబాద్ లో కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. ల్యాబర్తి గ్రామంలో తనకున్న 2.5 ఎకరాల వ్యవసాయ భూమిలో వేసిన వరి పంటకు మందు వేయడానికి హైదరాబాద్ నుండి స్వగ్రామానికి చేరుకున్నారు. అతని పొలానికి నీరుపెట్టే ప్రయత్నంలో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన గమనించిన పక్క భూమి రైతు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారి కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకోగా వెంకటేశ్వర్లు ప్రాణాలు కోల్పోయి ఉన్నారు. ఇట్టి విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చందర్ తెలిపారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



రాయపర్తి/ఫిబ్రవరి 27(జర్నలిస్ట్ వార్త): బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు ఐత రాకేష్ తండ్రి ఐత ఎల్లయ్య, బురహన్ పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు పిట్టల సుధాకర్ తండ్రి పిట్టల సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రంగు కుమార్ గౌడ్, పూస మధు, ఎలమంచి శ్రీనివాసరెడ్డి, లేతకుల రంగారెడ్డి, గారే నర్సయ్య,ఐత రా%శీ%చందర్,ఐత కుమార్, ముద్ర బోయిన సుధాకర్,చందు రాము యాదవ్,చందు సతీష్,ఐత రవి,జంపి,రంజిత్ తదితరులు పాల్గొన్నారు.?

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు





**రాయపర్తి/ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండల వ్యాప్తంగా 66 మంది ఓటర్లకు 60 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో సుమారు 47 మంది పురుషులు, 13 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 90 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికలలో తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ పరిశీలించారు.

# చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి

## - వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**హనుమకొండ ఫిబ్రవరి 27(జర్నలిస్ట్ వార్త):** గురువారం హనుమకొండ జిల్లా కేంద్రం ఆర్ఈసీ సమీపంలోని తార గార్డెన్స్ లో చేనేత హస్తకళ హ్యాండ్లూమ్, హ్యాండిక్రాఫ్ట్ ప్రదర్శన, అమ్మకం స్టాల్స్ గురువారం ముఖ్య అతిథులుగా పాల్గొన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత హస్త కళలు పురాతనమైనవన్నారు. విభిన్న రూపాల్లో సంప్రదాయాలను దాటే చేనేత హస్తకళలను అందరూ ప్రోత్సహించి, ఆదరించాలన్నారు. ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులు వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రదర్శనను సందర్శించి, ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రాజ మల్లారెడ్డి, సింగారపు రవి ప్రసాద్, నాయకులు రఘుపాల్ రెడ్డి, పవన్ కుమార్, చేనేత హస్తకళల నిర్వాహకులు, తదితరులు ఉన్నారు. ఆర్ఈసీ సమీపంలోని తార గార్డెన్స్ లో చేనేత హస్తకళ హ్యాండ్లూమ్, హ్యాండిక్రాఫ్ట్ ప్రదర్శన, అమ్మకం స్టాల్స్ గురువారం ముఖ్య అతిథులుగా పాల్గొన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత హస్త కళలు పురాతనమైనవన్నారు. విభిన్న రూపాల్లో సంప్రదాయాలను దాటే చేనేత హస్తకళలను అందరూ ప్రోత్సహించి, ఆదరించాలన్నారు. ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులు వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రదర్శనను సందర్శించి, ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రాజ మల్లారెడ్డి, సింగారపు రవి ప్రసాద్, నాయకులు రఘుపాల్ రెడ్డి, పవన్ కుమార్, చేనేత హస్తకళల నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

# ప్రతి ఒక్కరు సేవా వృదయాన్ని అలవార్చుకోవాలి

## -కాంగ్రెస్ పార్టీ యువనేత నారపోగు వెంకట్







తల్లాడ/పిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త): ప్రతి ఒక్కరు సేవా వృదయాన్ని అలవార్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ యువనేత సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు నారపోగు వెంకట్ అన్నారు.గురువారం గ్రామంలో దళిత కుటుంబాలను పరామర్శించి అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు నేనున్నానని అనారోగ్యంతో బాధపడుతున్న పాస్టర్ దేవ సహాయంకు 10వేలు, తడికమళ్ళ ప్రవీణ్ కు 10వేలు, తోటపల్లి సాయమ్మకు 10వేలు, ఇస్నేపల్లి వరమ్మకు 5వేలు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామ మాజీ సర్పంచిగా విధులు నిర్వహించటంతో పాటు ప్రస్తుతం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ప్రధాన అనుచరుడుగా హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తల్లాడ మండలానికి, స్వగ్రామానికి వచ్చినప్పుడల్లా సేవా కార్యక్రమాలు చేస్తూ జన్మభూమికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇటీవల గ్రామంలో అయ్యప్ప పడిపూజకు 50 వేలు, దళితుల సభకు సుమారు 2లక్షల రూపాయలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేసిన సంగతి విధితమే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఇబ్బందులు పడటంతో గ్రామస్తులు తనకు తెలియజేయడంతో స్పందించినట్లు తెలిపారు. తల్లాడ మండలానికి, గ్రామానికి ఎప్పుడు తన సేవలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు, బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్నపల్లి వెంకటేశ్వర్లు, సాధం మల్లయ్య, పగిడిపల్లి గోపయ్య, లక్ష్మణ్, గొల్లమందల సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయాలి

### -మండల కన్వీనర్ బొట్ల శ్రీనివాస్



**రాయపర్తి/ఫిబ్రవరి 27(జర్నలిస్ట్ వార్త):** ఈనెల 28 హైదరాబాద్ లో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరగబోయే బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి మండలం కన్వీనర్ బొట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ దేశంలో జరగబోయే జనాభా లెక్కలతో పాటు కుల జనగణన చేయాలనీ, దామాషా ప్రకారం చట్ట సభల్లోనూ, విద్యా వైద్యం ఉపాధి రంగాల్లో ఎవరి వాటా వారికి ఇవ్వాలనే అంశాలపై ఈనెల 28 న హైదరాబాద్ హిమాయత్ నగర్ మగ్దూం భవన్ లోని రాజ్ బహదూర్ గౌర్ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.బీసీల హక్కులు, రిజర్వేషన్లకు మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారనీ అన్నారు.ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన కులగణనలో 3.1% ప్రజలు పాల్గొనకపోవడం వలన ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు నమోదు చేసుకొనే అవకాశం కల్పించినందున నమోదు కాని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కుల జన గణన ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు, విద్యా ఉద్యోగ అవకాశాలు కల్పించాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ,రాష్ట్ర బీసీ నాయకులు,మేధావులు పాల్గొననునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ము రాజు,డోలి సారంగం,బొమ్మల శ్రీను,యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**రాయపర్తి/ఫిబ్రవరి 27(జర్నలిస్ట్ వార్త):**
వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జక్కుల గణేష్ తాత జక్కుల కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా గురువారం బాధిత కుటుంబాన్ని పైనీడు సీడ్ ఆర్గనైజర్ ఈదులకంటి మహిపాల్ రెడ్డి పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పరుపాటి రాజేందర్ రెడ్డి,సంది మహేందర్ రెడ్డి, బైరి రమేష్, దుండి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్లకు అవగాహన సదస్సు

### ముఖ్యఅతిథిగా సిడిపిఓ నిర్మలా జ్యోతి -అంగన్వాడీ టీచర్లు కు వాటర్ బాటిల్స్ పంపిణీ





**కల్లూరు/ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):**
వేసవికాలంలో గర్భిణీ స్త్రీలు, పిల్లలు తీసుకునే పోషక ఆహారం పై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిడిపిఓ నిర్మలా జ్యోతి అన్నారు.గురువారం కల్లూరు ప్రాజెక్టు పరిధిలో పేరువంచ సెక్టార్ సూపర్ వైజర్ భవాని ఆధ్వర్యంలో తిరువూరు క్రాస్ రోడ్ అంగన్వాడి సెంటర్ నందు గురువారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. వేసవికాలంలో గర్భిణీ స్త్రీలు, పిల్లలు తీసుకునే పోషక ఆహారం ,వారు తీసుకునే జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథితులుగా సిడిపిఓ నిర్మలా జ్యోతి,పోషణ అభియాన్ బీసీ హరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో గర్భిణీ స్త్రీలు,ప్రీ స్కూల్ పిల్లలు బాలింతలు తీసుకునే పోషకాహారం,దాని ఆవశ్యకత గురించి అంగన్వాడీ టీచర్ల కు అవగాహన కల్పించారు.స్కూల్ నిర్వహణలో అలసత్వం వహించొద్దని,సమయపాలన పాటించాలని, ప్రీ స్కూల్ నిర్వహణ బాధ్యతగా నిర్వహించాలని అన్నారు.ఫీడింగ్ సక్రమంగా అధించాలని ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ కి తెలిపారు. ఈ సందర్భంగా తిరువూరు క్రాస్ రోడ్ అంగన్వాడి సెంటర్ టీచర్ ఖమ్మంపాటి రాణి ఎండ తీవ్రత దృష్ట్యా తోటి అంగన్వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన వాటర్ బాటిల్స్ ని సిడిపిఓ, సూపర్ వైజర్ చేతుల మీదుగా అంగన్వాడీ టీచర్స్ కి అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు కృష్ణవేణి,శ్రీదేవి,రాజేశ్వరి తరితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ శాతం

### - ఘననియంగా పెరిగిన పోలింగ్ శాతం -జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ



**భూపాల్ పల్లి జిల్లా/ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):**
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ శాతం ఘననియ్యంగా పెరిగిందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ అన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ ఖమ్మం-వరంగల్-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ 93 శాతం, కరీంనగర్- నిజామాబాద్- మెదక్-ఆదిలాబాద్ ఉపాధ్యాయల పోలింగ్ 92 శాతం, పట్టభద్రుల శాతం 76 శాతం జరిగినట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు జరిగినట్లు ఆయన తెలిపారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎన్నికల్లో 329 మంది ఓటరులు ఉన్నారని, 308 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని 93 శాతం జరిగినట్లు తెలిపారు. నిజామాబాద్-మెదక్-ఆదిలాబాదు-కరీంనగర్ పట్ట భద్రులు 2483 మందికి గాను1903 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని 76 శాతం నమోదైనట్లు తెలిపారు. అలాగే నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మిల్సి ఎన్నికకు 83 మంది ఓటర్లు ఉండగా 77 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని 92 శాతం నమోదైనట్లు తెలిపారు. జిల్లాలో ఎమ్మిల్సి ఎన్నికల



పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరగడం పట్ల జిల్లా ఎన్నికల అధికారి హర్షం వ్యక్తం చేశారు. పోలింగ్ నిర్వహణలో బాగస్వాములైన అన్ని శాఖల అధికారులను ఆయన అభినందించారు. పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య వరంగల్, కరీంనగర్ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు పోలింగ్. సామగ్రి పంపనున్నట్లు ఆయన వివరించారు.

# పచ్చని చెట్టుకు గొడ్డలి వేటు

### -చెట్లు నరకడంపై గ్రామస్తుల ఆగ్రహం -పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కార్యదర్శి రాజు






**కల్లూరు/ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి హరితహారం పేరుతో గ్రామాల్లో పట్నాలలో పల్లె ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటుంది అయితే కొందరు అక్రమార్కులు స్వార్థపూరితమైన ఆలోచనలతో ఉన్న చెట్లని నరకడం తీవ్ర ఆగ్రహానికి లోను చేస్తుంది ఏకంగా ప్రభుత్వ కార్యాలయంలోనే ఇలా జరగటం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తుంనా ఏ అధికారి అటువైపు కన్నెత్తి చూడకుండా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని అడిగే నాధుడు లేడనే చర్చ గ్రామంలో మొదలైంది. వివరాల్లోకి వెళ్తే ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలో పేరువంచ గ్రామపంచాయతీ కార్యాలయంలో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు కొందరు 30 సంవత్సరాల పెద్ద చెట్లను నరికి ఎత్తుకుపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి హరితహారం పేరుతో మొక్కలు నాటిస్తుంటే ఉన్న మొక్కలు నరకటం ఏమిటని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కీసర రవీందర్ రెడ్డి మెంతుల అనిల్ ప్రశ్నించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏ సభలు సమావేశంలు పెట్టుకున్న చక్కటి నీడ నిచ్చే చెట్లు ఉండటం చాలా సంతోషం.కాసులకు కక్కుర్తి పడి ఆ సంతోషం వద్దనుకున్నారు ప్రబుద్ధులు. ఏకంగా గ్రామపంచాయతీ కార్యాలయంలోనే మొక్కలు నరకడం పై గ్రామస్తులందరూ కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైతే చెట్లలను నరికారో దాని వెనుకున్న సూత్రధారులు ఎంతటి వారైనా చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఎందుకు నరకాల్సి వచ్చింది ఎవరి ప్రమేయంతో నరికారు దీని వెనక ఎవరున్నారు అన్న దానిపై గ్రామస్తులు ఆరాతీస్తున్నారు. నడి ఊర్లో పట్టపగలే గ్రామపంచాయతీలో ఇట్లాంటి దారుణాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇంకా ఏమైనా చేయటానికి వెనకాడరని దీన్ని మొగ్గలోనే తుంచి వేయాలని ఆలోచనతో గ్రామస్తులు అందరూ కూడా నడుం బిగించినట్లు తెలుస్తోంది. గతంలో ఎప్పుడు ఇలాంటివి జరగలేదు దీనికి అడ్డుకట్ట వేయకపోతే అడ్డ అదుపు లేకుండా కొత్త సాంప్రదాయానికి తెర తీసే అవకాశం ఉందని తీవ్రంగా మండిపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఒకరు ముగ్గు వెంకటాపురం నకు చెందిన వారని ఒకరు ముత్తగూడెం నకు చెందిన వ్యక్తి చెట్లను నరికినట్లు తెలిపారు. అయితే వీరు ఎవరు చెప్పితే నరికారో వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తే నిజ నిజాలు బయటపడే అవకాశం ఉన్నట్టు గ్రామస్తులు చెప్పారు.

### గ్రామ పంచాయితీ కార్యదర్శి రాజు ను వివరణ కోరగా...

గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో చెట్లు యొక్క కొమ్మలు రామాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి,గంగుల సీతారావమ్మ ఇంటి పైకి వెళ్ళిన కొమ్మలను తొలగించాలని వారు దరఖాస్తు ఇవ్వడం జరిగింది.ఈ నెల 20న మా సిబ్బందితో దగ్గర ఉండి అడ్డుగా వచ్చిన కొమ్మలను తొలగించడం జరిగిందని తెలిపారు. ఈనెల 21వ తేదీన నేను సెలవులో ఉండగా మాకు తెలియకుండా గ్రామపంచాయతీ సిబ్బంది ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని



వ్యక్తులు చెట్లను నరికి వాటిని ఎత్తుకెళ్లినారు. మరుసటి రోజు నేను ఆఫీసుకు వచ్చి చూడగా చెట్లు పూర్తిగా తొలగించబడిన విషయం మా సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ విషయంపై ఎంపీడీవో కు సమాచారం ఇవ్వడంతో వారి ఆదేశాలతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఈ 22 న ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. చెట్లు నరికిన వ్యక్తులను గుర్తించి విచారణ జరిపి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొవాలని కోరానని అన్నారు.

## తల్లాడ మండలంలో 100% పోలింగ్ నమోదు





**తల్లాడ/పిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండలంలో 100% పోలింగ్ నమోదు అయ్యిందని టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు షేక్ లాల్ సయ్యద్, తాళ్లూరు శ్రీనివాసరావు అన్నారు. గురువారం తల్లాడ రింగ్ సెంటర్లో టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు షేక్ లాల్ సయ్యద్ తాళ్లూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్సాహంగా ఎన్నికల పోలింగ్ ను ముగించడం జరిగింది.నల్గొండ ఖమ్మం వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగువెల్లి నర్సిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఈ కార్యక్రమం లో పాల్గొన్నామన్నారు.ఈ పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి అత్యంత ఉత్సాహభరిత వాతావరణం లో 100% పూర్తి చేయడం జరిగింది, 37 మంది ఓటర్ల గాను 37 మంది ఓటు వేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జీవీ నాగమల్లేశ్వరరావు రామదాసు టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు వడ్డే వెంకటేశ్వరరావు మండల నాయకులు బి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





## వేగంగా కొనసాగుతున్న బురద తొలగింపు చర్యలు

### ఎస్ఎల్బీసీ వద్ద ఇంకా వీడని ఉత్కంఠ

మహబూబ్నగర్, ఫిబ్రవరి27(జర్నలిస్ట్ వార్త): ఎస్ఎల్బీసీ టన్నెల్లో పేరుకుపోయిన బురదను తొలగించే ప్రక్రియ షురూ అయింది. గురువారం నాడు సహాయక చర్యల్లో భాగంగా ఒక వైపు డీ వాటరింగ్ చేస్తూ, మరో వైపు బురదను లోకో ట్రైన్ ద్వారా బయటికి తీసుకువస్తున్నారు. టీబిఎం మిషన్ సమీపంలో పడి ఉన్న సామాగ్రిని కూడా తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే తప్ప సహాయక చర్యలు చేపట్టే అవకాశం లేదని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బురద తొలగించే పనులను నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్లు పర్యవేక్షిస్తున్నారు. సొరంగం నుంచి పెద్ద ఎత్తున బురద బయటకు తీస్తున్నారు. లోకో ట్రైన్ వెళ్లి రావడానికి గంట సమయం పడుతుంది. పెద్ద ఎత్తున కూలీలను ఉపయోగించి.. లోపల హిట్యాచి ద్వారా బురదను బయటికి తకలిస్తున్నారు. భారీ యంత్రం సహాయంతో వీటిని తీసి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఈరోజు మొత్తం ఇదే కార్యక్రమం సాగుతుందని.. బురద తీసాక పరిస్థితిని అంచనా వేసి లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం ఎలా అనేదానిపై ఒక ప్రణాళిక సిద్ధం చేస్తామని చెబుతున్నారు. ఒక వైపు బురద తొలగిస్తూనే మరో వైపు టీబిఎం మిషన్ను చిన్న చిన్న బాగాలుగా కట్ చేస్తున్నారు. ఈ భాగాలను కూడా వేరుచేసి బయటకు తీస్తున్నారు. ముందుగా రెండుకిలోమీటర్ల వద్ద బురదను క్లియర్ చేస్తున్నారు.

# టాలీవుడ్‌కి మళ్లీ వస్తున్నా..!



తెలుగు ప్రేక్షకులకు కొన్నాళ్ల క్రితం 'అల్లూరి' సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ కయాదు లోహర్. ఈ అమ్మడు ఆ సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపు దక్కించుకోలేక పోయింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో కయాదు లోహర్‌కి పెద్దగా గుర్తింపు దక్కలేదు. దాంతో టాలీవుడ్‌లో ఈ అమ్మడు ఆ తర్వాత ఆఫర్లు సొంతం చేసుకోలేక పోయింది. ఆ సినిమా తర్వాత కోలీవుడ్‌లో ఆఫర్లు దక్కించుకున్న కయాదు ఇటీవల డ్రాగన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రదీప్ రంగనాథ్ హీరోగా రూపొందిన డ్రాగన్ సినిమా తెలుగులోనూ విడుదల అయింది. రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ పేరుతో విడుదలైన డ్రాగన్ సినిమా తెలుగులోనూ మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. డ్రాగన్ సినిమాలో కయాదు లోహర్ నటనకు తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఈ అమ్మడు తెలుగులో గతంలో ఒక సినిమా చేసింది అంటే నమ్మశక్యంగా లేదని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా ఉన్న ఈ అమ్మడు త్వరలో ఫంకీ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. తెలుగులో డ్రాగన్ సినిమాకు మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో తెలుగులో ఒక వీడియోను ఈమె షేర్ చేసింది. తెలుగు నేర్చుకుంటున్నట్లు చెప్పడంతో పాటు, తెలుగులో డ్రాగన్ సినిమాకు మంచి స్పందన ఇచ్చినందుకు గాను ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేసింది. తెలుగులో క్యూట్‌గా మాట్లాడిన ఈమె వీడియో వైరల్ అవుతోంది. కయాదు లోహర్ తన తెలుగు రీ ఎంట్రీని కన్ఫర్మ్ చేసింది. త్వరలో తెలుగులో మళ్లీ వస్తున్నాను అంటూ అధికారికంగా ప్రకటించింది. అంతే కాకుండా ముందు ముందు మరిన్ని తెలుగు సినిమాలతో వస్తాను అంటూ పేర్కొంది. తెలుగు నేర్చుకుని తెలుగులో నటించేందుకు సిద్ధం అవుతున్న కయాదు లోహర్ తెలుగులో మంచి హీరోయిన్‌గా, స్టార్ డం దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలుగులో ఈ అమ్మడు నటించబోతున్న సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అల్లూరి సినిమాతో నిరాశ పరచిన కయాదు లోహర్‌కి ఫంకీ సినిమా హిట్ ఇచ్చేనా చూడాలి.




# సల్మాన్ 'సికిందర్' టీజర్

బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్, రష్మిక మందన్న జంటగా ప్రముఖ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం సికిందర్. భావోద్వేగాలతో కూడిన ఈ చిత్రాన్ని ప్రముఖ బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మరోసారి సల్లూభాయ్ తనదైన స్టైల్‌లో యాక్షన్ సీన్స్‌తో అదరగొట్టారు. అలాగే మురుగదాస్ కూడా మళ్లీ తనదైన టేకింగ్‌తో టీజర్‌ను రిచ్‌గా చూపించారు. ఈ ఏడాది రంజాన్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మూవీ టీమ్ ప్రకటించింది.

# రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్న కుబేర




విజనరీ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా కుబేర. ప్రస్తుతం టాలీవుడ్ లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్టుల్లో కుబేర కూడా ఒకటి. ఈ చిత్రాన్ని జూన్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తుండగా, రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తుంది. బాలీవుడ్ లో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జిమ్ సర్బ్ కుబేరలో ప్రత్యేక పాత్రలో కనిపించనున్నాడు. వీరంతా కుబేరలో తమ కెరీర్లో మునుపెన్నడూ చేయని సరికొత్త పాత్రలు చేస్తున్నారు. రిలీజ్ డేట్ పోస్టర్ లో నాగార్జున, ధనుష్ ఎదురెదురుగా చాలా ఇంటెన్స్ లుక్ లో కనిపించగా, బ్యాక్ గ్రౌండ్ లో జిమ్ సర్బ్ పాత్ర పవర్‌ఫుల్ గా ఉండనున్నట్టు ఆయన అప్పియరెన్స్ చూస్తుంటే అర్థమవుతుంది. ఇదిలా ఉంటే ఇప్పటికే కుబేర నుంచి ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ గ్లింప్స్ ను రిలీజ్ చేయగా ప్రతీ గ్లింప్స్ ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. ఈ సినిమాలో ధనుష్, నాగార్జున మధ్య వచ్చే సీన్స్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటాయని అందరూ ముందు నుంచే చెప్తున్నారు. 90వ దశకం నేపథ్యంలో రూపొందుతున్న సినిమా కావడంతో కుబేర కోసం స్పెషల్ సెట్స్ వేసి మరీ షూట్ చేశారు. సెట్స్ కోసమే నిర్మాతలు చాలా భారీగా ఖర్చు పెట్టారని టాక్ కూడా వచ్చింది. ఓ సాధారణ బిచ్చగాడు వేల కోట్లు సంపాదించే ధనవంతుడిగా మారితే అతనికి ఎదురయ్యే పరిణామాలు ఎలా ఉంటాయనే నేపథ్యంలో కుబేర రూపొందుతుంది. సునీల్ నారంగ్, రామ్ మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది. ఎలాగూ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు కాబట్టి ఇక మీదట కుబేర నుంచి వరుస అప్డేట్స్ వచ్చే అవకాశముంది.

# 'కన్నప్ప' అద్భుతమైన ప్రయాణం :అక్షయ్ కుమార్!




ముంబైలో జరిగిన ప్రత్యేక మీడియా ఈవెంట్‌లో 'కన్నప్ప' టీజర్‌ను ఆవిష్కరించారు. బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ .. మంచు విష్ణు .. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ ఈ కార్యక్రమంలో సందడి చేశారు. సినిమా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీ వినయ్ మహేశ్వరి అధ్వర్యంలో ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది. ప్రత్యేకంగా ప్రదర్శించిన ఈ 'కన్నప్ప' టీజర్ అందరినీ ఆకట్టుకుంది. అక్కడి మీడియా ప్రతినిధులు 'కన్నప్ప' టీజర్ మీద ప్రశంసలు కురిపించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో డా. మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రం విజువల్ వండర్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది.

శివుడి పాత్రలో నటించిన అక్షయ్ కుమార్ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'మొదటగా 'కన్నప్ప' ఆఫర్ నా వద్దకు వచ్చినప్పుడు రెండు సార్లు తిరస్కరించాను. కానీ భారతీయ సినిమా ప్రపంచంలో శివుడిగా నేను బాగుంటాను అని విష్ణు పెట్టుకున్న నమ్మకమే నన్ను ఈ సినిమా ఒప్పుకునేలా చేసింది. 'కన్నప్ప' కథ చాలా శక్తివంతమైంది. ఎంతో లోతైన ఎమోషన్స్ ఉంటాయి. విజువల్ వండర్‌గా ఉండబోతోంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో భాగం కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను' అని అన్నారు. మంచు విష్ణు మాట్లాడుతూ.. 'కన్నప్ప' కేవలం నాకు ఓ ప్రాజెక్ట్.. ఓ సినిమా కాదు.. ఇది నా జీవిత ప్రయాణం. నేను ప్రస్తుతం భారతదేశంలోని అన్ని జ్యోతిర్లింగాలను సందర్శిస్తున్నాను. 'కన్నప్ప' కథతో నాకు ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. ఇది అచంచలమైన విశ్వాసం, త్యాగానికి సంబంధించిన కథ. ఈ ప్రయాణంలో అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలు మాతో చేరడం నాకు చాలా గర్వంగా ఉంది. ఎందుకంటే భక్తి, దైవిక శక్తితో నిండిన ఈ కథ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి వ్యక్తికి చేరుతుందని మేము నమ్ముతున్నాం. ఇది సరిహద్దులను దాటి మానవాళి హృదయంతో మాట్లాడే చిత్రం కానుంది'అని అన్నారు. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. అక్షయ్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలను డైరెక్ట్ చేయడం అద్భుతమైన అనుభవం. వారందరూ చాలా సహకరించారు. వారి పాత్రలు తెరపై అద్భుతం చేయబోతోన్నాయి. ఈ చిత్రం పట్ల విష్ణుకున్న ప్యాషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఉత్కంఠభరితమైన విజువల్స్ తో 'కన్నప్ప' అందరి ముందుకు రాబోతోంది. ఇప్పటికే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ దృష్టిని ఆకర్షించిన ఈ 'కన్నప్ప' టీజర్, మార్చి 1న అందరి ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఏప్రిల్ 25, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది"అని అన్నారు.

# బ్లాక్ బస్టర్ డేట్ కే.. నితిన్ 'తమ్ముడు'

టాలీవుడ్ యంగ్ హీరో నితిన్.. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. మార్చి 28వ తేదీన రాబిన్ హుడ్ మూవీతో సందడి చేయనున్నారు. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాపై ఇప్పటికే ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయనే చెప్పాలి. అదే సమయంలో నితిన్ చేతిలో ఉన్న మరో ప్రాజెక్ట్ తమ్ముడు. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్న మూవీలో వర్ష బొలమ్మ హీరోయిన్ గా నటిస్తోంది. సీనియర్ నటి లయ కీలక పాత్రలో యాక్ట్ చేస్తుండడం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై దిల్ రాజు గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ? అయితే డైరెక్టర్ శ్రీరామ్ వేణు, దిల్ రాజు కాంబినేషన్ లో ఇప్పటికే వచ్చిన %వీజూూ%, వకీల్ సాబ్ చిత్రాలు కమర్షియల్ గా మంచి సక్సెస్ అందుకున్న విషయం తెలిసిందే. దీంతో వీరిద్దరి కాంబోలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న తమ్ముడు ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి. మూవీ సూపర్ హిట్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇక సినిమాను మహా శివరాత్రి పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ఇప్పుడు కొత్త రిలీజ్ డేట్ ను మేకర్స్ ఫిక్స్ చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. త్వరలోనే మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేస్తారట. సమ్మర్ కానుకగా మే 9వ తేదీన తమ్ముడు మూవీ గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారని తెలుస్తోంది. అందుకు సంబంధించిన అనౌన్స్మెంట్ ఇచ్చి.. క్రేజీ అప్డేట్ కూడా మేకర్స్ ఇవ్వనున్నారని సమాచారం. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారగా.. మేకర్స్ సూపర్ డేట్ ను ఫిక్స్ చేశారని అంటున్నారు. ఎందుకంటే ఇప్పటికే టాలీవుడ్ లో జగదేకవీరుడు అతిలోకసుందరి, గ్యాంగ్ లీడర్, మహానటి, మహర్షి వంటి ఎన్నో సినిమాలు ఆ రోజు రిలీజ్ అయ్యి సూపర్ హిట్స్ గా నిలిచాయి. రవితేజ మాస్ జాతర కూడా అప్పుడే వస్తుందని రీసెంట్ గా వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఆ సినిమా తప్పుకుందని తెలుస్తోంది. ఏదైనా తమ్ముడు మూవీ సరైన డేట్ కే రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. మరి ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.



# పుట్టబోయే పిల్లల గురించి కూడా ట్రోల్ చేస్తున్నారు -ప్రియమణి



ఇండస్ట్రీకి వచ్చి ఎన్నో ఏళ్లవుతున్నా ప్రియమణికి ఇప్పటికీ వరుస అవకాశాలు వస్తూనే ఉన్నాయి. సౌత్ తో పాటూ నార్త్ లో కూడా ప్రియమణికి మంచి గుర్తింపే ఉంది. పలు సినిమాలు, సిరీస్‌లు, టీవీ షోలతో బిజీగా ఉన్న ప్రియమణి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవతున్నాయి. పెళ్లి తర్వాత తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు చెప్తున్న ప్రియమణి, తాను మతాంతర వివాహం చేసుకోవడం వల్లే తనకు ఈ సమస్యలు వచ్చినట్టు చెప్తోంది. పెళ్లి చేసుకున్నప్పటి నుంచి కొంతమంది తనను విమర్శించడమే పనిగా పెట్టుకుని టార్గెట్ చేస్తున్నారని తెలిపింది. కేవలం తనను మాత్రమే కాకుండా తన భర్తను, పుట్టబోయే పిల్లల్ని కూడా ఇందులోకి లాగుతున్నారని ప్రియమణి బాధ పడింది. ప్రియమణి 2017లోనే ముస్తాఫా రాజ్ ని పెళ్లి చేసుకుంది. 2016లో వీరిద్దరికీ ఎంగేజ్‌మెంట్ జరిగింది. నిశ్చితార్థం జరిగినప్పటి నుంచే తనకు ఆన్ లైన్ లో విమర్శలు ఎదురయ్యాయని అంటుంది ప్రియమణి. తనకు ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయాన్ని తన వాళ్లతో చెప్తే సంతోషిస్తారనుకుంటే వారు మాత్రం తనను లవ్ జిహాది అంటూ ఇబ్బంది పెడుతూ విమర్శిస్తున్నారని ప్రియమణి చెప్తోంది.